క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల్లో సహాయక చర్యలు చేపట్టడానికి నరసాపురం మున్సిపాలిటీ నుంచి 40 మంది పారిశుద్ధ్య కార్మికులు వెళ్లారు. వారికి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానం చేసి నూతన దుస్తులను అందించారు. అనంతరం డంపింగ్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ మెషీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పేరు చెప్పి డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు



జి.వాసు, ఎస్సై

మొగల్తూరు: పోలీసులు పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.వాసు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు ఏఎస్సై భాస్కరరెడ్డి పేరుతో డబ్బులు ఫోన్‌పే ద్వారా వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసులు పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్టుగా తెలిసిందని దీనిపై విచారణ చేస్తున్నామన్నారు. ఏఎస్సైభాస్కరరెడ్డి అనే పేరు ఉన్న వ్యక్తి ఇక్కడ విధులు నిర్వహించలేదని ప్రజలు ఎవ్వరూ నమ్మి మోసపోవద్దని సూచించారు. బాధితుల చేసిన ఫోన్‌పే నంబర్‌లను ద్వారా విచారణ చేస్తున్నామన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: దసరా నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి సుబ్బారాయుడుతో పాటు వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చిన అన్నసమారాధనలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ఎం.ప్రభాకర్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామ సచివాలయం–2లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని డీఎల్‌డీఓ ఎం.ప్రభాకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. తాత్కాలిక ఆధార్ కేంద్రాలకు వచ్చే వారి కోసం తగు ఏర్పాట్లు చేయాలని, వారు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఈ శిబిరంలో 40 మందికి ఆధార్ అప్‌డేట్‌లు చేసినట్లు తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, గ్రామ కార్యదర్శులు యర్రంశెట్టి సత్యనారాయణ, దుడె శివప్రసాద్, ఆధార్ మండల పరిషత్ సిబ్బంది సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

కొబ్బరి చెట్ల వేలం ఖరారు



సీతారామపురం సచివాలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం సౌత్ పంచాయతీ పరిధిలోని 63 కొబ్బరి చెట్లకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొండేటి చంటి రూ.2.04 లక్షలకు వేలం దక్కించుకున్నారు. పాట మొత్తంలో సగం మొత్తం పాటదారుడు పంచాయతీకి జమ చేయాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని తరువాత కాలంలో చెల్లించాలి. మూడేళ్లపాటు కొబ్బరి ఫలసాయాన్ని పొందేందుకు గానూ ఈ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి వెంకట్, ఈఓపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్రకుమార్, కార్యదర్శి మండెల శ్రీనివాస్, జేవీఆర్, గుత్తుల శ్రీనివాస్, మందపల్లి రాజు, మాదాసు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విలీన పంచాయతీల్లో కానరాని అభివృద్ధి

- ఉపాధి హామీ పనులకు గండి
- పారిశుద్ధ్య పనులు కనుమరుగు



భగ్గేశ్వరంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త



భగ్గేశ్వరంలో సీసీ రోడ్డుకు సమానంగా నిలిచిపోయిన మురుగు నీరు



యాళ్లవానిగరువు పంచాయతీ ఎదురుగా గోతులమయంగా ఉన్న గ్రావెల్ రోడ్డు

పాలకొల్లు అర్బన్: విలీన పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ఉపాధి హామీ పనులు జరగకపోవడంతో కూలీలకు ఉపాధి కరువైంది. అలాగే ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడం లేదు. అంతే కాక డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏడు గ్రామాల ప్రజలు అటు మునిసిపాలిటీకి చెందకుండా ఉన్నారు. అయితే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పాలన గాడి తప్పింది. పాలకొల్లు మునిసిపాల్టీలో పాలకొల్లు మండలం నుంచి పాలకొల్లు రూరల్, ఉల్లంపర్రు, వరిధనం, పూలపల్లి, భగ్గేశ్వరం, అలాగే యలమంచిలి మండలంలోని కొంతేరు, అడవిపాలెం గ్రామాలను విలీనం చేస్తూ 2019లో గవర్నర్ సంతకంతో గెజిట్ విడుదలైంది.

విలీనంపై కేసులు

మునిసిపాల్టీలో విలీనం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అడవిపాలెం, కొంతేరు గ్రామాల నుంచి కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో స్థానిక సంస్థలకు ఎన్నికలను ఈ ఏడు పంచాయతీలకు నిలుపుదల చేశారు. దీంతో ఈ గ్రామాల అభివృద్ధి గత ఐదేళ్ల నుంచి గాడి తప్పింది. కేవలం ఆయా పంచాయతీల నుంచి ఇంటి పన్నులు, చెరువులు, చెట్లు, మార్కెట్, డాక్యుమెంటు ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయంతో పరిపాలన అంతంత మాత్రంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించారు. నిర్మించారు. అయితే ఈ పంచాయతీల విలీనం వ్యవహారం కోర్టులో కేసు నడవడం కారణంగా ఈ పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించలేకపోయారు. విలీనం అంశం కోర్టుల్లో ఉండడంతో ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా నిర్వహించడం లేదు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ గ్రామాలకు నిలిచిపోయాయి. అయితే కేసుల విషయం తేలితే గానీ ఆయా ప్రాంతాల్లో పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.

> **పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది**
>
> విలీన పంచాయతీల సమస్య కోర్టులో వ్యాజ్యం నడుస్తున్నందు వల్ల అభివృద్ధి కుంటుపడింది. ఉపాధి కూలీలు రోడ్డున పడ్డారు. పంచాయతీలకు కేంద్ర నుంచి రావాల్సిన నిధులు కూడా నిలిచిపోయాయి. పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీలపై అజమాయిషీ కొరవడింది. పన్నుల వసూళ్లు కూడా దారి తప్పింది.
>
> – నల్లి నాగరాజు, యాళ్లవానిగరువు

వైభవంగా రామాలయ పునః ప్రతిష్టాపనోత్సవాలు



రామాలయ పునః ప్రతిష్టా మహోత్సవాల్లో పూజలు చేస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలోని శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక స్వామివార్ల విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుహోమం తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు శ్రీమాన్ ఖండవల్లి దామోదరానంత వెంకటాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పునఃప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవరం సత్యనారాయణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ముగిసినా దరఖాస్తులకు అవకాశం



యలమంచిలి: కాజ గ్రామంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్



పెనుగొండ: వడలిలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దారు అనితకుమారి

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూమి సమస్యలపై వినతులు స్వీకరించేందుకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారం కాజ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభతో ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామ సభలు ముగిసినా రైతులు ఎవరికైనా విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నా, జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ చేయాల్సి ఉన్నా ఈ నెల 30 లోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ గ్రామ సభలో రీ సర్వేలో భూ సమస్యలపై రైతులు ఏ విధంగా దరఖాస్తు చేయాలో? అవగాహన కల్పించారు. కాజ గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ కోసం 45 దరఖాస్తులు, మ్యూటేషన్ కోసం 15 దరఖాస్తులు, విస్తీర్ణం సవరణకు 19, కొరిలేషన్‌కు 10 మొత్తం 89 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కాజ తూర్పు, కాజ పడమర సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, గుబ్బల వేణుగోపాలస్వామి, ఎంపీటీసీ జిల్లెళ్ల రత్నారాజు, పీతల శ్రీనివాస్, పాలంకి నారాయణమూర్తి, కొప్పినీడి సర్వేశ్వరరావు ఆర్ఐ యశోద తదితరులు పాల్గొన్నారు.

వడలిలో..

పెనుగొండ: భూ సమస్యల పరిష్కారంకోసం వడలి గ్రామ సభలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. శుక్రవారం వడలి పంచాయతీ వద్ద నిర్వహించిన రీ సర్వే సంబంధిత సమస్యల కోసం నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దారు జి.అనితకుమారి పాల్గొని 90 దరఖాస్తులు స్వీకరించారు. డ్రోన్ సర్వే తప్పుల తడకగా ఉందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు రైతు అంగీకారం ఉంటేనే విస్తీర్ణం సరి చేయడం వీలవుతుందన్న దానికి రైతులు పూర్తిగా వ్యతిరేకమన్నారు. సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రాజేష్, గణపతినీడి బుల్లియ్య, ఉప్పలపాటి చంటి, అంగర ప్రసాద్ పాల్గొన్నారు.

సందర్శకులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్ కిషోర్

మొగల్తూరు: కార్తీకమాసంలో బీచ్‌కు వచ్చే సందర్శకులకు సంబంధించి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేది నుంచి డిసెంబర్ 2వ తేది వరకూ కార్తీక మాసం సందర్భంగా పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలు సముద్ర స్నానం చేసి దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు నిర్మాణం చేస్తున్నామన్నారు. సముద్రం స్నానం నిర్దేశిత ప్రాంతం పరిధిలోనే స్నానం చేయాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటలలోపు మాత్రమే స్నానాలకు అనుమతిస్తామన్నారు. బీచ్ వద్ద వద్దకు వచ్చే వాహన దారుల నుంచి ఎలాంటి టోల్ గేట్‌లు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. పోలీస్, మత్స్యశాఖ, పంచాయతీ, రెవెన్యూ, వైద్యశాఖల ఆధ్వర్యంలో సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బస్సు రూట్లలో మార్పు

నరసాపురం: కవిటం నుంచి మార్టేరు వరకూ పెనుగొండ నుంచి పెరవలి వరకూ రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా నరసాపురం డిపో నుంచి ఆ రూట్లో ప్రయాణించే బస్సులను కొద్ది రోజుల పాటు దారిమళ్లించి తిప్పుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులు రూట్ల మార్పు విషయాన్ని గమనించాలని సూచించారు. నరసాపురం–రాజమండ్రి వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు బ్రిడ్జి, ఆలమూరు మార్టేరు మీదుగా వెళతాయన్నారు. విశాఖపట్టణం బస్సులు కూడా అదే రూట్‌లో నడుస్తాయని చెప్పారు. నరసాపురం–తణుకు రూట్‌లో నడిచే బస్సులు వయా పాలకొల్లు, లంకలకోడేరు, నెలమూరు బ్రిడ్జి ఆలమూరు, కంతేరు మీదుగా తణుకు వెళతాయని చెప్పారు. కమలాపురం, అశ్వరావుపేట, ద్వారకాతిరుమల, సత్తుపల్లి బస్సులు కూడా ఇదే రూట్‌లో నడుస్తాయని చెప్పారు. నరసాపురం–నిడదవోలు వెళ్లే బస్సులు వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, నెలమూరు బ్రిడ్జి బీరుగా పెరవలి నిడదవోలు వెళ్తాయన్నారు.

పంట కాలువలను ఆధునికీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి సూర్యనారాయణ రాజు

పెనుగొండ: పంట కాలువలను ఆధునికీకరించి పూర్తి స్థాయిలో రైతులకు సాగు నీరు అందించాలని రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వల్లూరు సంతమార్కెట్ వద్ద రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల్లో అనుభవం కలిగిన నాయకులను ఎన్నుకొంటే రైతులకు మంచి జరుగుతుందన్నారు. పంట కాలువలను ఆధునికీకరించే సమయంలో లోతుగా తవ్వకుండా కాలువ గట్టును పటిష్ట పరచాలని సూచించారు. మట్టిని లోతుగా తవ్వడం వల్ల పంట భూములు మెరకగా మారి, నీరు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. దీంతో రైతులు ఇంజిన్లతో నీటిని తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా కాలువల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, పంట కాలువల్లోనూ మురుగుకాలవల్లోనూ పేరుకుపోవడంతో నీరు ముందుకు సాగక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటకాలువల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్ల శివారు ప్రాంతాలకు నీరు చేరుకోవడం కష్టసాధ్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు పిల్లి శ్రీరాములు, చిట్టూరి వెంకట సుబ్రహ్మణ్యం, బోళ్ల మరియా, బోళ్ల లవకుమార్, తాళం సుబ్బారావు, కేతా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనక దుర్గమ్మ వారి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో కనుమూరు వెంకట రామకృష్ణంరాజు

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం బొంద రత్నరాజు స్మారక చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మండలంలోని 11 హైస్కూల్స్‌లో ఈ పోటీలు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో 70 మంది, ప్రాథమికోన్నత స్థాయిలో 90 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభ కనపరిచారు. యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలను ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ విద్యార్థులకు ఈ రకమైన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ విజేతలకు మండల మహాసభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, కార్యదర్శులు పంతం రామ్మూర్తినాయుడు, దొమ్మేటి చంద్రశేఖరరావు, బూరగడ్డ శైలజ, కందాళం విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం

పాలకొల్లు సెంట్రల్: పౌరసరఫరాల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని తహసీల్దార్ యడ్ల దుర్గా కిశోర్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓల భవనంలో ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దుర్గా కిశోర్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు అందించే సమయంలో ప్రజలతో సఖ్యతతో మెలగాలన్నారు. వారిపై కోపం, విసుగుదలగా మాట్లాడడం వంటివి చేయకూడదన్నారు. ప్రజలకు అందించే ప్రభుత్వ పథకాలు నేరుగా మీ చేతులమీదుగా ఇస్తున్నట్లు భావించాలన్నారు. తూకం విషయంలో సరుకు నాణ్యతల్లో ఇతర ఏ విషయాల్లో లోపాలు ఉన్నా అవకతవకలు జరిగినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ డీలర్లతో సఖ్యతగా మెలుగుతూ నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. ఏ వార్డుల్లో, ఏ గ్రామంలో తిరుగుతున్నారో? ముందుగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ డీటీ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలో పేదలకు సీట్లు కేటాయించాలి



పెనుగొండ ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు గత ప్రభుత్వం నిర్ణయించిన 25 శాతం సీట్లు కేటాయింపు కొనసాగించాలని సీపీఎం పెనుగొండ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుగొండ ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 2023లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను హైకోర్టు రద్దు చేసిందంటూ ప్రైవేటు విద్యా సంస్థలు పెనుగొండలో రెండు సంవత్సరాల ఫీజు చెల్లించాలంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి 25 శాతం సీట్లు కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, గుర్రాల సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్.అనూష, ఆర్.అనూష, టి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులతో కాటన్ పార్కు కళకళ



పర్యాటకులతో కళకళలాడుతోన్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు సందర్శకులతో కళకళలాడుతోంది. పార్కును రూ.1.14 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. గత ఏడాది అభివృద్ధి చేసి మూతపడి ఉన్న పార్కును గత ఏడాది ప్రారంభించారు. దీంతో సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. వారాంతాలు, సెలవు దినాల్లో అయితే సందర్శకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. సాధారణంగా వేసవిలో పార్కులో సందర్శకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రస్తుత వర్షాకాలంలో కూడా పార్కు జనంతో కళకళలాడుతోంది. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటోంది. దీంతో రాత్రివూట కూడా సందర్శకుల సంఖ్య మరింత పెరిగింది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్ పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్యపార్కు. కాటన్‌పార్కు శిథిలమై దాదాపు మూతపడే స్థితికి వచ్చింది. దీంతో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయింప చేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

చిన్నారులకు దంత పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షల అవగాహనా సదస్సు నిర్వహించారు. స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులో చాతుర్య పాఠశాల నందు డాక్టర్ పెనుమాక బార్గవి సాయిశ్రీ చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షుడు జక్కంపూడి మదన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి ప్రవచనాలు

పెనుగొండ: ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు శిష్యుడు చిలకల పూడి పాండురంగ స్వామి దేవాలయ ఆస్థాన ప్రచారకులు భక్త రవితేజ ప్రవచనం ఆకట్టుకుంది.శుక్రవారం వడలిలోని మందాలమ్మ ఆలయంలో ప్రవచనం చేశారు. సనాతన ధర్మ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శ్రీగోవింద సాయి గీతా సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ సాల్ట్‌నే వాడాలి



అయోడైజ్డ్ సాల్ట్ వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని

వీరవాసరం: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వీరవాసరం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం అయోడైజ్డ్ సాల్ట్ వినియోగం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిబివిఎల్ సరోజిని అయోడైజ్డ్ సాల్టు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మనం తీసుకునే ఆహారంలో చాలా తక్కువ మోతాదులో అయోడిన్ లభిస్తుందని కనుక అయోడైజ్డ్ సాల్ట్ వాడటం వలన శరీరంలో అయోడిన్ లోపాన్ని నివారించవచ్చునని ఆమె చెప్పారు. సాల్ట్‌ను మూత గట్టిగా ఉన్న డబ్బాలలో మాత్రమే నిల్వ చేసుకోవాలని, వంట చివరిలో మాత్రమే సాల్ట్ వాడటం వల్ల అయోడిన్ నష్టపోకుండా మనకు అందుతుందని తెలిపారు. గర్భిణిలంతా తప్పనిసరిగా అయోడైజ్డ్ సాల్ట్ మాత్రమే వినియోగించాలని ఆమె కోరారు.

హత్యాయత్నంపై కేసు

కాళ్ల: పాతగొడవలను నేపథ్యంలో యువకుడిపై దాడి చేసిన సంఘటనపై కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్లగ్రామానికి చెందిన కొల్లి సాయిరాజేష్‌పై అదే గ్రామానికి చెందిన నాగవరప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు యువకులు బీరు సీసాతో దాడి చేశారని, తెలిపారు. ఈ దాడిలో సాయిరాజేష్ మెడపై తీవ్ర గాయమైంది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని భీమవరం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.